ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 40.5 కనిష్ఠం : 24.0



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760

ధర్మవరం, పుట్టపర్తి : 9963160529

కదిరి :9052518170

ఏసీఎం: 9985411154

టీడీపీ ఆవిర్భావంతోనే నిజమైన స్వాతంత్య్రం

తప్పుడు కేసుల నుంచి కార్యకర్తలకు త్వరలో విముక్తి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



సన్మాన గ్రహీతలు, పార్టీ నాయకులతో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావంతోనే ఆంధ్రప్రదేశ్‌కు నిజమైన స్వాతంత్య్రం వచ్చిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. సూర్య చంద్రులు ఉన్నంతవరకు నందమూరి తారకరామారావు ప్రజల గుండెల్లో ఉంటారని అన్నారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ జెండా ఆవిష్కరించి, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

అనంతరం టీడీపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు 200 మంది, ఉత్తమ కార్యకర్తలు 14మందిని మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రజలు దేవుడిగా చూస్తున్నారని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో బడుగు బలహీనవర్గాలను గుర్తించిన పార్టీ టీడీపీ అని అన్నారు. నాయకులు పార్టీ ఫిరాయించినా కార్యకర్తలు అహర్నిషలు పార్టీకోసం కష్టపడతారని అన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. తనను నమ్మి పెనుకొండ ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయనని, చిన్న పొరపాట్లు జరిగినా సరిదిద్దుకుందామని అన్నారు.

ఆస్పత్రికి రూ.2 కోట్ల పరికరాలు

పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి కియ సహకారంతో రూ.2 కోట్ల విలువైన అధునాతన పరికరాలను ఇస్తామని మంత్రి సవిత అన్నారు. వైసీపీ హయాంలో ఆస్పత్రి అధ్వానంగా తయారైందని, ఇకపై మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేశారని, తప్పుడు కేసులు పెట్టారని అన్నారు. వాటి నుంచి విముక్తి కలిగిస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తలపై పెట్టిన కేసు వివరాలు సేకరించానని, ఆ వివరాలను ముఖ్యమంత్రి, హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని అన్నారు.

పోరాడే కార్యకర్తల పార్టీ: అంజినప్ప

దాడులు చేసినా ఎత్తిన జెండా దించకుండా పోరాడే బలమైన కార్యకర్తలున్న పార్టీ టీడీపీ అని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. పెనుకొండ నియోజకవర్గానికి ఎస్.రామచంద్రారెడ్డి, పరిటాల రవి, పరిటాల సునీత, బీకే పార్థసారథి, నిమ్మల కిష్టప్ప, మంత్రి సవిత లాంటి నేతలను అందించిన పార్టీ తెలుగుదేశమని కొనియాడారు. పార్టీలో కష్టపడి పనిచేస్తే గుర్తింపు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాములు, సిద్దయ్య, గోరంట్ల సుబ్బారెడ్డి, గిరిధర్‌గౌడ్, నారాయణస్వామి, కేశవయ్య, దాదు, గోపాల్, సూరీ, పోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది సందడి

కొనుగోళ్లతో కిక్కిరిసిన పట్టణ ప్రధాన కూడళ్లు



ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ధర్మవరం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శనివారం మార్కెట్లు కిటకిటలాడాయి. గ్రామాల నుంచి మండల కేంద్రాలు, పట్టణాలకు ప్రజలు తరలిరావడంతో సందడి ఏర్పడింది. ప్రజలు పూజా సామగ్రి, నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు రావడంతో దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. ముఖ్యంగా ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్, అంజుమన్‌సర్కిల్, గాంధీనగర్, కళాజ్యోతిసర్కిల్ ప్రాంతాల్లో ఎక్కడా చూసిన జనం కొనుగోళ్లతో కనిపించారు. గాంధీనగర్ నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.



ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు జనంతో రద్దీ

కలెక్టరేట్‌లో నేడు ఉగాది వేడుకలు

పుట్టపర్తిటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహిస్తామని జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి నరసయ్య ఆదివారం తెలిపారు. కలెక్టర్ టీఎస్ చేతన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలను తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు ఆయన నింపాలని ఆకాంక్షించారు.

రైల్లో అర్ధరాత్రి చొరబడ్డ దొంగలు

(వివరాలు 9లో..)



గ్రీవెన్స్ రద్దు : ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 31న జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)ను రద్దు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈవిషయాన్ని గమనించాలని సూచించారు. జిల్లా ప్రజలకు ఆమె ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





సత్యసాయి సన్నిధిలో పాటలు పాడుతున్న భక్తులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సత్యసాయిసేవాసంస్థల ఆంధ్రప్రదేశ్ విభాగం చేపట్టిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపచేశాయి. సేవాసంస్థల రాష్ట్ర ప్రెసిడెంట్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టూల్ కిట్లను సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శనివారం పంపిణీ చేశారు. ఉదయం సాయికుల్వంతులో భక్తులు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలను ఆలపించారు. అంతరంగసాయిపేరిట సంగీత గాన కచేరి నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి ఆధ్యాత్మిక సేవలు, మహాత్మ్యంపై కవి సమ్మేళనం నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు సత్యసాయి ప్రేమ తత్వంపై సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. రాత్రి పట్టణ వీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు.

తెలుగువారి కీర్తి పతాక.. టీడీపీ

ఆవిర్భావ సభలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

నెలాఖరులోపు పన్ను వసూలు

(వివరాలు 8వ పేజీలో)

రైతుకు అదనపు ఆదాయం కల్పించాలి

కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు అదనపు ఆదాయం కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఆయన వ్యవసాయ అనుబంధ రంగాలు, డ్వామా, మార్కెటింగ్, మత్స్యశాఖ, భూగర్భజల శాఖల అభివృద్ధిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరికరాలు ఉపయోగించి, రైతుల ఆదాయం పెంచడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దానిమ్మ పంటల సాగులో టిష్యూ కల్చర్ పద్ధతిని ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహించడానికి 32 మండలాల్లో మండలానికి ఒక రైతును ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలన్నారు.

పెనుకొండ ప్రాంతంలో గొర్రెలు, మేకల మాంసం ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. చేపల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి చిత్రావతి, గొల్లపల్లి రిజర్వాయర్లలో విత్తన చేపల పెంపకం చేపట్టాల న్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న నగర వనాలను నిర్ణీత కాలంలో పూర్తిచేయాలని అటవీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ చక్రపాణి, డీపీఓ విజయ్ కుమార్, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఉద్యానశాఖాధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ శుభదాస్, పట్టుపరిశ్రమ జేడీ పద్మావతి, మార్కెటింగ్ శాఖ నరసింహమూర్తి, గ్రౌండ్‌వాటర్ అధికారి మల్లికార్జునరావు పాల్గొన్నారు.





ఓర్వలేకే తప్పుడు రాతలు


ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ పత్రిక తప్పుడు రాతలు రాస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం ప్రజలు వైసీపీ అవినీతిని భరించలేక తమపై నమ్మకం ఉంచి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. వైసీపీ పాలనలో ప్పటి ఎమ్మెల్యే గార్మెంట్ పరిశ్రమ నిర్వాహకులను డబ్బు డిమాండ్ చేస్తే మూసి వేశారని, తాము అధికారంలోకి వచ్చాక 3 వేల మందికి ఉపాధి కల్పించామన్నారు. కేవలం 9 నెలల్లోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేసి చూపిన ఘనత తమ ప్రభుత్వాది అని అన్నారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి పెద్ద కమెడియన్ అని, ఆయనది ఉనికి కోసం ఆరాటమే తప్ప పోరాటం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





కెనరా బ్యాంక్ Canara Bank

అప్పరచెరువు బ్రాంచ్ (6193)

డి.నెం. 11, మెయిన్ రోడ్, అప్పరచెరువు, బత్తలపల్లి మండలం, శ్రీసత్యసాయి జిల్లా-515661

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలువబడును) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత: శ్రీ చీమల నాగభూషణ వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము రూ. 6,12,342.45/- (అక్షరాల ఆరు లక్షల పన్నెండు వేల మూడు వందల నలభై రెండు రూపాయలు మరియు నలభై ఐదు పైసలు మాత్రమే) మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది 22.01.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని 29.03.2025వ తేదీన స్వాధీనపరచుకున్నారని ఈ నోటీసు ద్వారా ఋణగ్రహీత, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్, అప్పరచెరువు బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బకాయి రూ. 6,24,842.45/- (అక్షరాల ఆరు లక్షల ఇరవై నాలుగు వేల ఎనిమిది వందల నలభై రెండు రూపాయలు మరియు నలభై ఐదు పైసలు మాత్రమే) తేది 29.03.2025 నాటికి మరియు వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

హిందూపూర్ ఆర్‌డి, ధర్మవరం యస్‌ఆర్‌డి, ధర్మవరం మున్సిపల్ ఏరియా, గిర్రాజు కాలనీ, కుసుమత్తూరు గ్రామం, సర్వే నెంబర్ 597-2, ప్లాట్ నెంబర్ 73 నందు 72.6 చ॥గజాల విస్తీర్ణంలో భూమి మరియు బిల్డింగ్ యావత్తు ఆస్తికి హద్దులు: తూర్పు: సంగల లింగమయ్య యొక్క ప్లాట్ నెం. 74, పడమర: తమ్మల లింగమయ్య ప్లాట్ మరియు ఇదే సర్వే నెం.లోని భూమి, ఉత్తరం: ప్లాట్ నెం. 59, దక్షిణం: ఇదే సర్వే నెం.లోని 20 అడుగుల వెడల్పు రోడ్డు. విస్తీర్ణం/ఏరియా: తూర్పు-పడమర: 13 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 50 అడుగులు. మొత్తం విస్తీర్ణం 72.6 చ॥గ॥

తేది: 29.03.2025,
ప్రదేశం: కదిరి

సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్



అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు



గుంతకల్లు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు నరసాపూర్-అరిసికెర-నరసాపూర్ (వయా అనంతపురం) ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07201/02)ను నడపనున్నట్టు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసాపూర్-అరిసికెరె ప్రత్యేక రైలును ఈ ఏప్రిల్ 6, 13, 20, 27, మే 04, 11, 18 25 తేదీల్లో నడపనున్నట్టు తెలియజేశారు. ఈ రైలు పేర్కొన్న తేదీలలో (ఆదివారాలలో) నరసాపూర్‌లో మధ్యాహ్నం 2-20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12-45 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26 తేదీల్లో (సోమవారాలలో) మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1 గంటకు నరసాపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గోవిందవాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపూర్ రోడ్డు, కంబం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపూర్, ధర్మవరం, హిందూపురం, యల్హంక స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

రైలు స్థానాల మార్పు

ధర్మవరం రైల్వే స్టేషన్‌లో నిర్వహణ సమస్యల కారణంగా మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు గమ్యస్థానాన్ని మార్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మచిలీపట్నం-ధర్మవరం (నం. 17215) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 31 నుంచి అనంతపురం వరకే గమ్యస్థానాన్ని కుదించినట్టు తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216)ను ఏప్రిల్ 1 నుంచి మే 1 వరకూ ధర్మవరం నుంచి కాకుండా అనంతపురం నుంచి బయల్దేరుతుందని తెలియజేశారు.

రహదారుల మరమ్మతుకు నిధులు

ఉమ్మడి జిల్లాకు భారీగా మంజూరు

అనంతపురం న్యూటౌన్/పుట్టపర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ పరిధిలోని రాష్ట్ర, జిల్లా రహదారుల మరమ్మతుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిధులు మంజూరు చేసింది. గుత్తి నుంచి పత్తికొండ మీదుగా ఆదోని వెళ్లే రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. అనంతపురం నుంచి తగరకుంట, అనంతపురం నుంచి రాయచూర్ రోడ్డు మరమ్మతులకు రూ.2.5 కోట్లు ఇచ్చింది. కళ్యాణదుర్గం నుంచి మడకశిర వెళ్లే రోడ్డుకు రూ.4.8 కోట్లు, రాయదుర్గం నుంచి బళ్లారి వెళ్లే రోడ్డుకు రూ.6.2 కోట్లు, ఉరవకొండ-కణేకల్లు రోడ్డుకు రూ.4 కోట్లు మంజూరు చేసింది. రాప్తాడు నియోజకవర్గంలోని దామాజిపల్లి-తాడిపత్రి రోడ్డుకు రూ.కోటి, నాగసముద్రం-పేరూరు రోడ్డుకు రూ.2.5 కోట్లు, పుట్టపర్తి నియోజకవర్గంలోని కోడూరు నుంచి ధర్మవరం వెళ్లే రోడ్డుకు రూ.కోటి మంజూరైంది. ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం రోడ్డుకు రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. పెనుకొండ నియోజకవర్గంలో బ్రాహ్మణపల్లి, కొల్లకుంట క్రాస్, జూలకుంట, మండ్లి మీదుగా వెళ్లే రహదారి, సోమందేపల్లి నుంచి రాచూరు, అడదాకులపల్లి, ఎల్‌జీపీ నగర్ రాచూరు రహదారులకు రూ.2.10 కోట్లు కేటాయించింది. సోమందేపల్లి మండలం ఆనందపురం సంగమేశ్వరం రాహదారి, బ్రహ్మసముద్ర మీదుగా కొల్లకుంట, వంగలపల్లి, బీచుగానిపల్లి, ఊటకూరు దాకా రూ.3.20 కోట్లు మంజూరైంది. ధర్మవరం నియోజకవర్గంలోని సంజీవపురం నుంచి వెంటకగిరిపాళ్యం, లింగారెడ్డిపల్లి, ముక్తాపురం, కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, మచ్చురామి రహదారులకు రూ.2.60 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. మడకశిర నియోజకవర్గంలో మధూడి, రామాపురం, బందర్లపల్లి, ఆర్‌జే రోడ్, జీఎస్ తండా, హెచ్‌ఆర్ హట్టి, పి.గొల్లహట్టి, అగళి, బొమ్మరాసనపల్లి, కొండేపల్లి రహదారికి రూ.2.62 కోట్లు ఇచ్చింది. కదిరి నియోజక వర్గంలో తిమ్మమ్మమర్రిమాను అనుసంధాన రహదారికి రూ.20 లక్షలు ఇచ్చింది. హిందూపురంలో కొండికొండ రాష్ట్ర సరిహద్దు, సోమందేపల్లి నుంచి ఎల్‌జీపీ నగర్ దాకా మరమ్మతులకు రూ.2.50 కోట్లు ఇచ్చారు. నాగసముద్ర నుంచి పేరూరు దాకా రహదారికి రూ.2.50 కోట్లు, దామాజీపల్లి నుంచి తాడిపత్రి రహదారికి రూ.కోటి, ధర్మవరం, కళ్యాణదుర్గం రహదారికి రూ.50 లక్షలు మంజూరైంది.



టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

తెలుగువారి కీర్తి పతాక.. టీడీపీ

ఆవిర్భావ సభలో పార్టీ నాయకులు

వాడవాడలా ఎగిరిన పసుపు జెండా

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలు

అనంతపురం అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కీర్తి పతాక తెలుగుదేశం అని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పసుపు జెండాను ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

● అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో, జడ్పీ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

● టీడీపీ ఆవిర్భావంతోనే ఏపీకి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత



రాయదుర్గంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుకొండలో టీడీపీ సీనియర్ నాయకులను సన్మానిస్తున్న బీకే పార్థసారథి



తాడిపత్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



నీలారెడ్డిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నాయకులు

● తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ పేదల కోసం స్థాపించారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడులోని పార్టీ కార్యాలయంలో పసుపు జెండాను ఎగురవేశారు.

● పేదరికాన్ని రూపుమాపడమే టీడీపీ లక్ష్యమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

● రాయదుర్గంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఎంపిక చేసిన పార్టీ సీనియర్ నాయకులను సత్కరించారు.

● పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ బీకే పార్థసారథి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను సన్మానించారు.

● తాడిపత్రి పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

● బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో పార్టీ జెండాను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని అన్నారు.

● మడకశిర ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

● కదిరి మున్సిపల్ కార్యాలయంలో వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

● పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు.

● ధర్మవరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు.



కళ్యాణదుర్గంలోని ప్రజావేదిక వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మడకశిరలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట



పుట్టపర్తి లో పార్టీ ఆవిర్భావ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె



ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న పరిటాలశ్రీరామ్

అనంత వాసులకు ఉగాది పురస్కారాలు

ప్రభాకర్ చౌదరికి కళారత్న అవార్డు



ప్రభాకర్ చౌదరి, ఉమ్మడిశెట్టి రాధేయ, పూర్ణచంద్రశేఖర్, గురుమూర్తి గుప్త

అనంతపురం కల్చరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాల్లో నలుగురు అనంత వాసులకు చోటు దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా 86 మందిని కళారత్న అవార్డులకు ఎంపిక చేయగా.. సామాజిక సేవల విభాగంలో అవే సంస్థ వ్యవస్థాపకుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి కళారత్న(హంస) అవార్డుకు ఎంపికయ్యారు. 116 మందిని ఉగాది పురస్కారాలకు ఎంపిక చేయగా అనంతపురం జిల్లా నుంచి సాహిత్య విభాగంలో ఉమ్మడిశెట్టి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ, వాస్తు జ్యోతిష్య పండితుడు చిత్రాల గురుమూర్తి గుప్త, రంగస్థల నాటకం విభాగంలో సురభి వనరస పూర్ణచంద్ర శేఖర్ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉగాది సంబరాల్లో వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందజేసి సత్కరించనున్నారు.

మైనాస్వామికి ఉగాది పురస్కారం



గోరంట్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చారిత్రక పరిశోధకుడు మైనాస్వామికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. చారిత్రక పరిశోధన, శాసన పరిశోధనలో ఆయన చేసిన విశేష కృషిని ప్రభుత్వం గుర్తించి, పురస్కారాన్ని ప్రకటించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే ఉగాది వేడుకలలో ఆయన పురస్కారాన్ని అందుకుంటారని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జున తెలిపారు.

తాడిపత్రికి రావద్దని ఆంక్షలు సరికాదు

ఎస్పీని కలిసిన వైసీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలో జరుగుతున్న పరిణామాలపై వైసీపీ నేతలు శనివారం ఎస్పీ జగదీష్‌ను కలిశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజమ్, నగర మేయర్ మహమ్మద్ వసీం, కౌన్సిలర్ ఫయాజ్ బాషా తదితరులు ఎస్పీని కలిశారు. ఇటీవల తాడిపత్రిలో మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటిపై జేసీ వర్గీయుల దాడిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాడిపత్రిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యాలు తీవ్రమయ్యాయని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక అటవిక రాజ్యం ఏర్పడిందన్నారు. వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి దాడి చేస్తే ఫయాజ్‌బాషాపై కేసు నమోదు చేయటం దారుణం అన్నారు. తాడిపత్రిలో ఉండొద్దంటూ ఆంక్షలు విధించటం సరికాదన్నారు. ఫయాజ్‌బాషాకు భద్రత కల్పించి తాడిపత్రికి పంపుతామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు. ఇఫ్తార్ విందు ఇస్తానని ఫయాజ్‌బాషా ప్రకటించాకే జేసీ వర్గీయులు దాడి చేశారని వివరించారు. ఫయాజ్ ఇఫ్తార్ విందు ఇస్తే జేసీకి సమస్య ఏంటి అని ప్రశ్నించారు. తాడిపత్రితో టీడీపీ దౌర్జన్యాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫయాజ్‌బాషా మాట్లాడుతూ... జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై కక్షసాధింపుతో వ్యవహరిస్తున్నారని అన్నారు. పోలీసుల సమక్షంలోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి రాళ్లతో దాడులు చేయించారని ఆరోపించారు. ఆయన నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

నేడు, రేపు పన్నుల చెల్లింపునకు అవకాశం

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో వార్షిక సంవత్సరం చివరి రోజు సెలవులు ఉన్నా, ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడానికి అవకాశం కల్పించామని ఆ శాఖ జిల్లా జాయింట్ కమిషనర్ శేషాద్రి శనివారం తెలిపారు. ఆదివారం, సోమవారం ఉగాది, రంజాన్ పండుగ లున్నా, పన్నుదారులు జిల్లా కేంద్రంలో పన్నుల శాఖ కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చని తెపాఆరు. సిబ్బంది పరిమితంగా అందుబాటులో ఉంటారని అన్నారు. అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అందుబాటులో ఉంటారని, ఏమైనా సందేహాలుంటే సమాధానం ఇస్తారని తెలిపారు.

13న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

అనంతపురంరూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్‌మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహిస్తున్న కురుగుంట కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి తెలిపారు. ఆమేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు.

రేపటి వరకే తొలివిడత

ఉచిత సిలిండర్‌కు చివరి అవకాశం

జిల్లాలో 5,05,831 మంది అర్హులు

ఇప్పటి వరకు 4,17,502 మంది వినియోగం

ఖాతాల్లోకి రూ.33.52 కోట్లు జమ

ఇంకా 88,329 మంది దూరం



అనంతపురం టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న గ్యాస్ సిలిండర్ల మొదటి విడతకు సోమవారంతో గడువు ముగుస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. నాలుగు నెలలుకు ఒక ఉచిత సిలిండర్ ఇవ్వడానికి ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. గతేడాది డిసెంబరులో ఉచిత సిలిండర్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. గ్యాస్ బుక్ చేసుకుని సిలిండర్‌ను పంపిణీ చేసిన 24 గంటల్లో తిరిగి వారిఖాతాల్లోకి ఆ సొమ్మును ప్రభుత్వం జమచేస్తూ వస్తోంది. డిసెంబరు నుంచి మార్చి 31వ తేదీ వరకు తొలి ఉచిత సిలిండర్‌కు అవకాశం ఇచ్చారు.

4,17,502 మందికి రూ. 33.52 కోట్లు జమ

అనంతపురం జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 6,66,330 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో నిబంధనల మేరకు 5,05,831 మందిని ఉచిత వంటగ్యాస్ పొందడానికి అర్హులుగా గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 4,17,502 మంది తొలి సిలిండర్‌ను బుక్‌చేసుకొని వినియోగించుకున్నారు. వీరందరికి ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌కు రూ.869 చొప్పున వారి ఖాతాల్లోకి జమచేసింది. ఇప్పటి వరకు మొత్తం రూ. 33,52,70,710 జమచేసింది.

88,329 మంది దూరం..

ఉచిత తొలి సిలిండర్ పొందడానికి సోమవారం వరకు మాత్రమే అవకాశం ఉంది. అధికారుల రికార్డుల మేరకు ఇంకా జిల్లాలో 88,329 మంది అర్హత ఉన్నా ఉచిత సిలిండర్ తీసుకోలేదు. వీరందరు తొలి ఉచిత గ్యాస్‌సిలిండర్ పొందాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు ఈనెల 31వతేదీలోగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

రేపే చివరి రోజు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్చి 31వ తేదీ వరకు ఉచిత గ్యాస్‌సిలిండర్ పొందడానికి అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో ఇంకా 88,329 మందికి తొలిసిలిండర్ పొందడానికి అర్హత ఉంది. వీళ్లందరు సోమవారం లోపు తప్పనిసరిగా బుక్ చేసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం ఆ డబ్బును వారి ఖాతాల్లోకి జమచేస్తుంది. తర్వాత బుక్‌చేసుకుంటే తొలి ఉచిత సిలిండర్ వారికి వర్తించదు. రెండో సిలిండర్‌కు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

- జగన్నాథ్‌రావు, ఇన్‌చార్జ్ డీఎస్ఓ

మండుతున్న ఎండ

సాధారణం కంటే 2-3 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత

బొమ్మనహాల్‌లో 42.29డిగ్రీలు సెల్సియస్ నమోదు

రాబోయే రోజుల్లో మరింత వేసవి తాపం

బుక్కరాయసముద్రం మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలతో జనాలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 8గంటలకే ఎండల తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 6గంటల వరకు తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు సెల్సియస్ ఎక్కువగా నమోదవుతున్నాయి. రానున్న ఏప్రిల్, మే మాసాలలో ఎండలు మరింత పెరగనున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. జిల్లాలో మార్చి చివరి వారం, ఏప్రిల్ మొదటి వారాల్లో సాధారణంగా 38-39.5 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవ్వాలి. అయితే శనివారం బొమ్మనహాళ్‌లో 42.29 డిగ్రీలు సెల్సియస్ నమోదయ్యింది. రాత్రి సమయంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20-21 డిగ్రీలు ఉండాలి. అలాంటిది 24 డిగ్రీలు సెల్సియస్ నమోదువుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో ఉక్కపోత బాగా పెరి గింది. ఉదయం 9 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడే పరిస్థితి. మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.



ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

బయటకు వెళితే ఎండ. ఇంట్లో ఉంటే ఉక్కపోత. దీంతో ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికస్థాయికి చేరుకోవడంతో ఫ్యాన్లు, కూలర్లు కూడా సరిపోవడం లేదు. బయటకు వచ్చిన సమయంలో గొడుగులు, టవళ్లు, టోపీలతో ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఎండ, వడగాడ్పుల తీవ్రత కు వడదెబ్బ తగిలే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, బయటకు వెళ్లవద్దని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

● అనంతపురం జిల్లాలో... అత్యధికంగా బొమ్మనహాళ్ 42.29, గుంతకల్లు 42.03, యల్లనూరు41.11, విడపనకల్లు41, శింగనమల 40.9 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యాయి.

● శ్రీ సత్యసాయి జిల్లాలో... కొత్తచెరువులో 41.2, సీకేపల్లి 41.2 తాడిమర్రి 41.1, ముదిగుబ్బ 41. కనగానపల్లి 40.07 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యాయి.

నెలాఖరులోపు పన్ను వసూలు: డీపీఓ



ఇంటర్వ్యూ interview

అనంతపురం న్యూటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. పంచాయతీల్లో పన్ను వసూళ్లు, సిబ్బంది పనితీరు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆయన వివరించారు.

ప్రశ్న: పన్ను వసూళ్లపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీపీఓ: జిల్లాలోని 31 మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో నెలాఖరులోపు వందశాతం పన్ను వసూలు చేయాల్సిందే. ఇప్పటికే కొన్ని చిన్న పంచాయతీల్లో 90 శాతం వరకు టార్గెట్ పూర్తి చేశాం. కొన్ని మేజర్ పంచాయితీల్లో డిమాండ్ ఎక్కువ ఉండటం, సిబ్బందికి ఇతర అదనపు పనులు ఉండటం వల్ల కొంత వెనుకబడి ఉన్నారు.

ప్రశ్న: విధులకు డుమ్మా కొట్టేవారిపై ఎలాంటి చర్యలు చేపడతారు?

డీపీఓ: పలు పంచాయితీల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. అందుకు ప్రధాన సాక్ష్యం బయోమెట్రిక్ హాజరే. అందులో నిర్లక్ష్యం వహించిన వారికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారి చేసి వివరణ కోరాం. రిపీట్ అయితే క్రమశిక్షణ చర్యలు తప్పవు.

ప్రశ్న: పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీపీఓ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పూర్తి స్థాయిలో మెరుగుపడాలి. ప్రత్యేక నిఘా ఉంచి మెరుగుకు తగిన చర్యలు చేపడతాం. కార్యదర్శులకు, ఈఓఆర్డీలకు పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించాం.

ప్రశ్న: కార్యదర్శులపై ఉన్న పని ఒత్తిడికి ప్రత్యామ్నాయ చర్యలు ఏవి?

డీపీఓ: పంచాయతీల్లో ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ అమలుతో సిబ్బంది పెరిగినప్పటికి కార్యదర్శులకు మాత్రం పని ఒత్తిడి అయితే పెరిగింది. అయితే అందుకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేసుకొని ఒత్తిడి తగ్గించుకొనేలా క్షేత్రస్థాయిలో కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏ విభాగానికి సంబంధించిన సర్వే ఆ విభాగ సిబ్బంది ద్వారా చేయిస్తే కార్యదర్శులు వారు చేయాల్సిన ట్యాక్స్ కలెక్షన్స్, పారిశుధ్యంపై దృష్టి సారించే అవకాశం ఉంది.

తిన్న సొమ్ము కక్కించేది ఎప్పుడు..?

డ్వాక్రా మహిళలకు యానిమేటర్లు, సీసీ బురిడీ

రూ.14 లక్షలకు పైగా స్వాహా... ఏళ్లు గడిచినా రికవరీ ఏదీ?



నిధుల దుర్వినియోగంపై వెలుగు కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు (ఫైల్)

యాడికి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొందరు యానిమేటర్లు, సీసీలు దుర్వినియోగం చేసిన డ్వాక్రా మహిళల రుణాలను రికవరీ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 2016-2017 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని తూట్రాళ్లపల్లి, నగరూరు, వెంగన్నపల్లి, తండా గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఉన్నతి పథకాల కింద సుమారు రూ.14లక్షల రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలను అప్పటి యానిమేటర్, సీసీలు మహిళలకు ఇవ్వకుండా సొంత అవసరాలకు వాడుకున్నారు. మరికొంతమంది మహిళలు తాము తీసుకున్న రుణాలకు సంబంధించి వాయిదాల డబ్బును బ్యాంక్‌కు చెల్లించమని యానిమేటర్లు, సీసీలకు అందజేస్తే దాన్ని కూడా మింగేశారు. తీసుకున్న రుణాల చెల్లింపులు జరగకపోవడంతో మహిళా సంఘాలకు నిధులు మంజూరైనా బ్యాంకర్లు వాటిని హోల్డ్‌లో పెట్టారు. దీనిపై మహిళా సంఘాల సభ్యులు వివరాలు ఆరాతీయగా బండారం బయటపడింది. దీనిపై 2020 నుంచి ఆ సంఘాల మహిళలు వెలుగు కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరిగారు. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలని పలు దఫాలుగా రోడ్డెక్కి ఆందోళనలు కూడా చేశారు. అధికారులు విచారణ చేశారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. కానీ సంఘాల మహిళలకు న్యాయం జరగలేదు. ఇటీవల నగరూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు చేపట్టకుండా ఏమి చేస్తున్నారని అధికారులను ఆయన మందలించారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా తగు చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. రోజులు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మహిళా సంఘాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

దుర్వినియోగం అయిన నిధుల వివరాలు

1. తూట్రాళ్లపల్లి గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహ గ్రామసంఘం రూ.4,25,446.
2. నగరూరు గ్రామంలో వెంకటేశ్వర గ్రామ సంఘం రూ.4,55,000
3. తండా గ్రామంలో సుంకులమ్మ గ్రామ సంఘం రూ.5,40,000

మొత్తం రూ.14,20,446

నిధుల దుర్వినియోగం వాస్తవమే

: చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం



గతంలో మహిళా సంఘాల నిధులు దుర్వినియోగమైన మాట వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదించాం. విచారణ కమిటీ వేశారు. దుర్వినియోగం మొత్తంలో రూ.14,20,446 రికవరీ చేయాల్సి ఉంది. బాధిత సంఘాల సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.


బఫర్‌తో సఫర్

వైసీపీ పాలనలో నియోజకవర్గంలో భారీ కుంభకోణం

వెయ్యి క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉందన్న అధికారులు

అధికారులు, వైసీపీ డీలర్ల కుమ్మక్కుతో స్వాహా

ప్రభుత్వం మారడంతో వెలుగులోకి అక్రమాలు



వైసీపీ పాలనలో రేషన్ షాపుల్లో జరిగిన బఫర్‌స్టాక్ కుంభకోణం నేడు అధికారుల మెడకు చుట్టుకుంటోంది. గత ఐదేళ్లలో రేషన్ బియ్యం కుంభకోణంలో వైసీపీ నాయకులు జేబులు ఫుల్లుగా నింపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలో సుమారు 1000 క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చౌక ధరల దుకాణాల మార్పు నేపథ్యంలో బఫర్ స్టాక్ సర్దుబాటుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. గత ప్రభుత్వంలోని చాలా మంది డీలర్ల వద్ద క్వింటా నుంచి 30 క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ఈ క్రమంలో గత కొన్ని నెలల నుంచి ఈ సమస్యపై పోరాడుతున్నా నేటికి కొలిక్కి రాకపోవడంతో సివిల్ సప్లై అధికారులు, నూతన డీలర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

ఇదీ సమస్య...

బయోమెట్రిక్ ద్వారా నిత్యావసరాలు పంపిణీ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతినెలా పంపిణీ తరువాత డీలర్ల వద్ద మిగిలి ఉన్న(బఫర్) నిత్యావసరాలను తదుపరి నెలకు కలుపుకుని అలాట్‌మెంట్ చేస్తారు. ఈ నేపథ్యంలో పాత డీలర్లకు రావాల్సిన కమీషన్ జమ చేసుకున్నప్పటికీ అలాట్‌మెంట్ ఎక్కువగా ఉండటంతో ఇంకా ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటోంది. 2019లో తాము బాధ్యతలు తీసుకున్న సమయంలో తమకు ఇలాగే బఫర్ ఇచ్చారని వైసీపీ డీలర్లు వాదనకు దిగుతున్నారు.

ఇన్‌చార్జి, బినామీలే అధికం

నియోజకవర్గంలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల్లో నలుగురు మాత్రమే రెగ్యులర్ ప్రాతిపదికన డీలర్లు ఉన్నారు. మిగిలిన వారందరూ ఇన్‌చార్జులు, బినామీలే. ఎవరో పేరు మీద ఎవరో దుకాణం నిర్వహించారు. ఇలా ఐదేళ్ల వైసీపీ పాలన అంతా ఇన్‌చార్జులు, బినామీలతోనే సాగింది. దీంతో మిగులు బియ్యాన్ని ఎవరికి వారే మింగేసినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో బఫర్‌ను వసూలు చేయడం కష్టంగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు ఆ పార్టీ నాయకులు, మద్దతుదారులు డీలర్లుగా ఉండటంతో కొందరు రెవెన్యూ అధికారులు బఫర్‌ను పట్టించుకోకుండా నెలవారీ కోటా వేసేవారు. ప్రస్తుతం నూతన డీలర్లు మాత్రం బఫర్ లేకుండా స్టోర్‌లు తమకు అప్పగించాలని అధికారులను కోరుతున్నారు.



బఫర్ బియ్యాన్ని అమ్మేశారు

కొందరు డీలర్లు బఫర్ బియ్యాన్ని అమ్మేయగా మరికొందరి వద్ద స్టాక్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకొందరు బియ్యాన్ని అమ్మి జొన్నలు, రాగులను ఎక్కువగా చూపారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే కర్ణాటక సరిహద్దు ఉండటంతో ఎక్కువగా రేషన్ బియ్యాన్ని తరలించినట్లు తెలుస్తోంది. ఈ మండలాల్లోనే ఎక్కువగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుండగా పోలీసులు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. బఫర్ ఉన్న డీలర్లపై 6ఏ కేసులు పెట్టాలా లేక క్రిమినల్ చర్యలు తీసుకోవాలా అంటూ రెవెన్యూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.



అధికారుల్లో ఆందోళన

బఫర్ బియ్యం బొక్కుడులో ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూ అధికారులు, స్టాక్ పాయింట్ అధికారుల ప్రమేయం కూడా ఉండటంతో వారిలో ఆందోళన మొదలైంది. వైసీపీ పాలనలో అధికారులు, డీలర్లు కమ్మక్కై కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. పాత డీలర్లపై ఎక్కువగా ఒత్తిడి పెడితే తమ పేర్లు బయట పెడతారన్న భయం అప్పటి అధికారులను వేధిస్తోంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రతి రేషన్ షాపుల్లోను బఫర్ ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో బఫర్ సమస్యతో స్టోర్ డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సివిల్ సప్లై కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్యను పూర్తి స్థాయిలో వివరించారు. దీంతో ఈ బఫర్ సమస్య కొద్ది రోజుల్లోనే పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

- రమేష్‌రెడ్డి, డీఎం, సివిల్ సప్లై, అనంతపురం

తోపుదుర్తిపై కేసు నమోదు

పెనుకొండ టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో దౌర్జన్యానికి దిగిన 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ తదితరులను నిందితులుగా చేర్చారు. తహసీల్దార్ సమక్షంలో ఉన్న ఎంపీటీసీలను తీసుకెళ్లే ప్రయత్నంలో మాజీ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అతని అనుచరులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, విధుల్లో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆయన అన్నారు. రెండు గ్రూపుల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం, రాష్ డ్రైవింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం, కార్యాలయంలోకి చొరబడటం వంటి నేరాలకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైల్లో అర్ధరాత్రి దోపిడీ

షిరిడీ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో చొరబాటు

హిందూపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): షిరిడీ నుంచి చెన్నైకి వెళ్లే ప్రత్యేక రైలులో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. పుట్టపర్తి సమీపంలోని నారాయణపురం వద్ద చైను లాగి రైలును ఆపారు. స్లీపర్ బోగీలో మహిళ మెడలో బంగారు గొలుసుని లాక్కున్నారు. మరో బోగీలో లాక్కునేందుకు ప్రయత్నించగా మహిళ కేకలు వేసింది. దీంతో వారు అక్కడే దిగి పారిపోయారు. ఆర్‌పీఎఫ్ పోలీసులకు రైల్వే టీటీ సమాచారం ఇచ్చారు. దీంతో హిందూపురం స్టేషన్‌కు రైలు చేరుకోగానే రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది రైలు ఎక్కి, బెంగళూరు వరకు తనిఖీ చేస్తూ వెళ్లారు. చెన్నైలో దిగిన తరువాత ఫిర్యాదు చేస్తామని బాధితులు చెప్పారని హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. దొంగలు రైలును ఎక్కడ ఎక్కారనే కోణంలో రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. చోరీ ఘటనపై స్పష్టమైన సమాచారం లేదు. నారాయణపురం వద్ద అటవీ ప్రాంతంలో రైలు ఆగడంతో ప్రయాణికులు ఆందోళన చెందినట్లు సమాచారం.

యువతి అదృశ్యం



పూజిత(ఫైల్)

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమార్తె పూజిత అదృశ్యమైనట్టు తల్లి భాగ్యలక్ష్మి టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పూజిత పట్టణంలోని గండికోట ప్రైవేటు ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. ఈమె ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వచ్చి, తిరిగి వెళ్లలేదు. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించిన ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

భారమైన పశు పోషణ

భారీగా పెరిగిన గ్రాసం ధరలు - ఆందోళనలో అన్నదాతలు

బత్తలపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగ్రాసం ధర పెరగడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ పంటల సాగు తగ్గడంతో గ్రాసం కొరత ఏర్పడింది. గ్రాసం ధరలు పెరగడంతో పశు పోషణ భారమైందని పాడి రైతులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు 2.97లక్షలు గేదెలు 60వేలు, గొర్రెలు, మేకలు 29లక్షలు ఉన్నాయి. బయట ఎక్కడేగాని కాసింత కట్టిపుల్ల కూడా దొరకని ప్రస్తుత వేసవిని దాటడం ఎలా అంటూ పోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ వేరుశనగ గడ్డి రూ.40వేలు, వరిగడ్డి ట్రాక్టర్ రూ.30వేలు పలుకుతోంది ఇంత అధిక ధరలు పెట్టి పోషించాలంటే కష్టమని పాడి రైతులు పేర్కొంటున్నారు. అయితే గ్రాసం ధరలు పెరిగినా పాల ధరలు మాత్రం పెరగకపోవడంతో పాడి పశువుల పోషణ కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెయిరీలలో లీటరు పాలను రూ.30 నుంచి రూ.35లకే కొంటుండటంతో ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని వారు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని పాల ధరలు పెంచాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశుగ్రాసం

ఉచితంగా గడ్డిని అందించాలి



ప్రస్తుతం పశుగ్రాసం ధరలు అధికంగా ఉన్నాయి. దీంతో పశు పోషణ భారంగా మారింది. ప్రభుత్వమే పశుగ్రాసాన్ని ఉచితంగా అందించి ఆదుకోవాలి.

- సుదర్శన్, పాడి రైతు, బత్తలపల్లి

పశువులను అమ్ముదామన్నా



పశుగ్రాసం ధరలు విపరీతంగా పెరిగాయి. పశుపోషణ భారమై వాటిని అమ్ముదామంటే తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా గడ్డిని పంపిణీ చేయాలి.

బాబు, పాడిరైతు, బత్తలపల్లి

తాడిపత్రి మున్సిపాలిటీకి అవార్డు



మాట్లాడుతున్న కమిషనర్ శివరామకృష్ణ

తాడిపత్రి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన 100వ స్కోచ్ అవార్డుల వేడుకల్లో తాడిపత్రి మున్సిపాలిటీకి వెండి అవార్డు దక్కింది. ఈ అవార్డును మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ శనివారం అందుకున్నారు. పట్టణంలో ఘన వ్యర్థ సేకరణ, నాశన పద్ధతులు విభాగంలో విశేష కృషిచేసినందుకుగాను అవార్డును ప్రకటించారు. తాడిపత్రి మున్సిపాలిటీ స్థిరమైన వ్యర్థ నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ రంగంలో చేసిన సేవలకు గాను అవార్డు సాధించి ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తోందని కమిషనర్ తెలిపారు.

సంతానం కలగలేదని ఆత్మహత్య

గార్లదిన్నె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు మారుతీ నగర్‌కు చెందిన షేక్ షెక్షావలి(32) సంతానం కలగలేదని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు షేక్ షెక్షావలికి షేక్ షాహిదాతో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. దంపతులు కూలి పనులు చేసుకుని జీవించేవారు. సంతానం కలుగకపోవడంతో వీరు తరచూ మథన పడేవాడు. ఈ క్రమంలోనే షెక్షావలి మద్యానికి బానిస అయ్యాడు. దీంతో భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం ఇంట్లో భార్య, ఇతర కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా షెక్షావలి వరండాలో పడుకున్నాడు. అయితే శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు బయటికి వచ్చి చూడగా షెక్షావలి ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి ఉన్నారు.

నిష్పక్షపాతంగా భద్రతా చర్యలు చేపట్టాం

● ఎస్ఐ సుధాకర్‌యాదవ్

రామగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా 27, 28 తేదీల్లో నిష్పక్షపాతంగా భద్రతాచర్యలు చేపట్టామని, మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ఎంపీటీసీలను వారు ఉద్దేశ్యపూర్వకంగా ఆలస్యంగా తెచ్చారంటూ అందుకు సంబంధించిన ఆధారాలను ఎస్ఐ విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులను సముద్రం ఒడ్డుకు తీసుకెళ్లి సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ప్రజలలో అనవసరమైన భయాందోళనను సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కల్గించారన్నారు. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా ప్రమాదకరంగా ప్రవర్తించడం, బూతులు తిడుతూ మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. ఇద్దరు ఎంపీటీసీలపై మిస్సింగ్ కేసులు ఉన్నప్పటికి ఆయన పోలీసులపై అనవసరంగా ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన బేల్దారి ఎం.రామక్రిష్ణ(35), ఇస్మాయిల్, ఎర్రిస్వామితో కలిసి శనివారం అనంతపురంలోని ఓ ఓ ఇంటి నిర్మాణ పనులకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. గుడ్‌చిల్డ్రన్స్ స్కూల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. దీంతో రామక్రిష్ణకు తీవ్రగాయాలు కాగా, ఎర్రిస్వామి, ఇస్మాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామక్రిష్ణ మృతి చెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. రూరల్ పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశకుపోయి.. మోసపోయాడు..!

పెద్దవడుగూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వడ్డీలేని లోన్ ఇస్తాం.. మీరు లాటరీలో గెలుపొందారు.. వంటి మాటలకు ప్రలోభపడి మోసపోవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు ఇస్తున్నా.. గ్రామీణ ప్రాంత ప్రజలు మోసపోతూనే ఉన్నారు. మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తికి శనివారం ఫోన్‌చేసి మీకు రూ.4లక్షలు వడ్డీలేని రుణం మంజూరైంది.. అందుకు ప్రాసెసింగ్ నిమిత్తం ఆన్‌లైన్ ద్వారా రూ.35వేలు చెల్లించాలని చెప్పడంతో ఆశపడి చెల్లించాడు. ఫోన్‌చేసిన వ్యక్తికి డబ్బులు చెల్లించాలని చెప్పడం కోసం ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ చేసి ఉంది. బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ ఉద్యోగి మృతి

డిసెంబరు 18న అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం



షణ్ముకానందరెడ్డి (ఫైల్)

యాడికి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): యాడికి మండలంలోని అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగి, నిట్టూరు గ్రామానికి చెందిన గూడూరు షణ్ముకానందరెడ్డి (30) బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. 2024 డిసెంబరు 18న యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో కూలర్‌లో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మరమ్మతులు చేపట్టడానికి వెళ్లిన కార్మికులు కూలర్ తలుపులను ఒక్కసారిగా తెరవడంతో నిప్పుకణికలు ఎగిరి వారిపై పడ్డాయి. ఈ ఘటనలో అప్పట్లో ఐదుగురు తీవ్రంగా గాయపడగా, ఒకరు మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ షణ్ముకానందరెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. మూడున్నర నెలలుగా బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. షణ్ముకానందరెడ్డికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఉగాది పండుగ పూట షణ్ముకానందరెడ్డి మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం సాయంత్రం	సహర్ సోమవారం ఉదయం
కదిరి:	6.32	-
ధర్మవరం:	6.37	-

న్యూస్ బాక్స్

ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ధర్మవరం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచే గోడౌన్‌లను శనివారం కలెక్టర్ టీఎస్ చేతన్ పరిశీలించారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదకను పంపిస్తున్నట్టు తెలిపారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నటరాజ్, రాజకీయ పార్టీలనాయకులు ఉన్నారు.

ఈద్గాలో నీడ ఏర్పాటు చేయండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

కదిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఈద్ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలో శాశ్వతంగా నమాజు చేసుకోవడానికి నీడను ఏర్పాటు చేయాలని ఈద్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు శనివారం విన్నవించారు. నీడ ఏర్పాటు చేస్తే ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశముంటుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీడను ఏర్పాటు చేయడానికి సహకరిస్తానన్నారు. మాజీ ఎంపీ కర్నల్ నిజాంతోపాటు ఈద్గా కమిటీ చైర్మన్ సీఎం ఫరూక్, బాహుద్దీన్, ఆల్ఫా ముస్తఫా, అబ్దుల్‌రబ్, షానవాజ్, రొద్దం బషీర్, డైమండ్ ఇర్ఫాన్, ఈద్గాకమిటీ సభ్యులున్నారు.

ఇన్విజిలేటర్ల సస్పెన్షన్‌ను రద్దు చేయాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల ఇన్విజిలేషన్ విధులలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను విధుల్లోకి చేర్చుకోవాలని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ధర్మవరం ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈఓ కిష్టప్పను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కదిరి పట్టణంలో ఇద్దరు, ముదిగుబ్బలో ఒకరి సస్పెండ్ చేశారని, వారి సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇతర అంశాలలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సస్పెన్సన్‌పై విచారించి తిరిగి చేర్చుకోవాలని డిమాండ్‌చేశారు. జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, సకల చంద్రశేఖర్, లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, బిల్లే రామాంజనేయులు, ఆదిశేషు, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

కార్మికుల మధ్య చిచ్చుపెట్టడం సరికాదు

● ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) విషయంలో జోక్యం చేసుకుని కార్మికుల మధ్య చిచ్చుపెట్టడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లాకార్యదర్శి జేవైపీ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఎంయూ నాయకుడని, కార్మికులకు సేవ చేస్తున్నానని చెప్పుకుంటున్న మోక హరిమోహన్ ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగి అన్నారు. ఇతను కదిరి బస్‌స్టేషన్‌లో ఇంటర్నెట్‌సర్వీస్ కోసం అద్దె రూం తీసుకుని జీవనం సాగిస్తున్నాడని, ఇతను పీఎఫ్, హయ్యర్ పెన్షన్, డిమాండ్ నోటీసులకు చిన్నచిన్న పనులకు ఒక్కోపనికి ఒక్కో రేటుతో పనులు చేస్తున్నాడన్నారు. దీనికితోడు యూనియన్ల విషయాల్లో తలదూర్చి ఉద్యోగుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈయనకు డిపోలలో అధికారులకు కొమ్ము కాస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టేవాడని కనీసం రిటైర్డ్ అయ్యావని ఇకనైనా బుద్ధిగా ఉండాలని వారు హితవుపలికారు.

నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్ నిరాశ్రయుల కేంద్రంలో క్రాంతి సొసైటీ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు శనివారం టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ముతుకూరు బీబీ దుస్తులు పంపిణీచేశారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా నిరశ్రాయులకు దుస్తులు పంపిణీ చేసినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

'యువత క్రీడల్లో రాణించాలి'

చిలమత్తూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని దేమకేతేపల్లిలో గ్రామీణ క్రీడాకారుల కోసం క్రికెట్ టోర్నమెంట్‌ని నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్‌ని శనివారం మండల టీడీపీ నాయకులు రంగారెడ్డి, అంజినప్ప, బేకరీ గంగాధర్, కురుబ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో మానసిక ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వం సాధ్యమన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

పెనుకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. 'జగన్ సర్కారుపోయి బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాక్‌లు అనే పుస్తకాన్ని హరి, బాబావలి, తిప్పన్న ఆవిష్కరించారు. విద్యుత్ చార్జీల పెంపు, సర్దుబాటు తదితర అంశాలను ఈ పుస్తకంలో వివరించడం జరిగిందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా పట్టణానికి చెందిన జయనాబ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నూర్‌మహమ్మద్ భార్య జయనాబ్ కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను గోరంట్ల ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

కదిరిలో ఉగాది సందడి

కదిరిఅర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వావసునామ సంవత్సరం సందర్భంగా పట్టణంలోసందడి నెలకుంది. కాలేజీ సర్కిల్‌లో పండుగకు అవసరమైన పువ్వులు, మామిడాకులు, టెంకాయలు, పండ్లు, కొనుగోలు చేయడానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. కనకాంబరాలు కేజీ రూ.550నుంచి 600, బంతిపూలు రూ.60 ధర పలికాయి. దుకాణాలు కొనుగోలు దారులతో రద్దీగా మారాయి.


కాలేజీ సర్కిల్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రజల కోసం బాధ్యతగా పనిచేయండి

●ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

నల్లమాడ, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి అధికారులు బాధ్యయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునితాబయి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలంలో తాగునీటి సమస్య గ్రామాల్లో ఎక్కువగా ఉందన్నారు. సమస్య ఉత్పన్నం కాకుండాచూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారుల పై ఉందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పథకం కింద కూలీలకు పనిదినాలతోపాటు కూలి ధరలు కూడా ప్రభుత్వం పెంచిందన్నారు. క్షేత్రస్థాయిలో తగిన పనులు కల్పించుకుని కూలీలు ఉపాధి పొందాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, అటవీ, పట్టుపరిశ్రమ, గ్రామీణాభివృద్ధి శాఖలు అమలు చేస్తున్న పథకాలను సమావేశం వివరించారు. పలువురు ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందించారు. తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ ఆజాద్, సూపరింటెండెంట్ గజ్జల శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డీ అమరనాథ్‌రెడ్డి, వైద్యాధికారి బాబ్‌జాన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మహిళ

అమావాస్య పూజలు


అమావాస్య పూజల్లో పద్మశాలి సంఘం సభ్యులు

ధర్మవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో మార్గశిర మాసం శనివారం సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి అమావాస్య పూజలు అర్చకులు నిర్వహించారు. ముందుగా మార్కండేయ స్వామికి కార్యసిద్ధి వినాయక స్వామికి శ్రీచక్ర సమేత మహాలక్ష్మి అమ్మవారికి, కాశీవిశ్వేశ్వరస్వామికి, అభయ ఆంజనేయస్వామి వారికి భద్రావతి భావనరుషుల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పద్మశాలియ బహూత్తమ సంఘం అధ్యక్షులు పుత్తారుద్రయ్య, జింకానాగభూషణం, మెడికల బాల కుళ్లాయప్ప, వడకల భాస్కర్, వెంకటరామయ్య, మోహన్, శీన, లక్ష్మీనారాయణ, పెద్దరెడ్డప్ప, నరేంద్ర, గంగాధర్, గోవిందు, పురుషోత్తం, కులబాంధవులు పాల్గొన్నారు.

విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలి

● న్యాయాధికారి జయలక్ష్మి



మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

కదిరిలీగల్/గాండ్లపెంట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రతి విషయంలోనూ విద్యార్థినులు జాగ్రత్తగా మెలిగితే మంచి ఫలితాలు ఉంటాయని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం గాండ్లపెంట మండలం కటారుపల్లి కస్తూర్బా పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టంపై నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్ దుర్గా అధ్యక్షత వహించగా న్యాయాధికారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యాయాధికారి మాట్లాడుతూ పోక్సో చట్టంపై వివరించారు. సాధారణ చట్టాలపై విద్యార్థికి అవగాహన పెంచడానికే న్యాయవిజ్ఞాన సదస్సులు అని చెప్పారు. అయితే విద్యార్థి దశ నుంచి విద్యపైన శ్రద్ధ పెట్టి విజయం వైపు దృష్టి ఉండాలని స్పష్టం చేశారు. సమాజంలో వికృత చేష్టలు, అసభ్యప్రవర్తనలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అంశాలను తెలుసుకోవాలన్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్త వహించి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మనల్ని మనం కాపాడుకుంటూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎవరిపైన ఆధారపడకుండా జీవించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, రూరల్ సీఐ నాగేంద్ర, గాండ్లపెంట ఇన్‌చార్జి ఎస్ఐ వలిబాషా పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎంపికపై హర్షం

ఓబుళదేవరచెరువు, మార్చి29 (ఆంధ్రజ్యోతి): యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నరసింహయాదవ్ ఎంపికపై ఆ సంఘం మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కంచి సురేష్, డ్రిప్ నాగరాజు, ఆదినారాయణ మాట్లాడుతూ యాదవసంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా నరసింహ యాదవ్‌ను సీఎం ఎంపికపై కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

నంబులపూలకుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్‌చెరువు విద్యానగర్‌కాలనీలో శనివారం ఎస్సీఎస్టీల చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఈఓఆర్డీ మాధవరెడ్డి, సర్పంచ్ దిల్‌షాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా చట్టాలు ఏర్పాటు చేసిందన్నారు. అలాగే సంక్షేమపథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనారోగ్యంతో స్టోర్ డీలర్ మృతి

ముదిగుబ్బ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ కోటిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్, స్టోర్ డీలర్ సుంకర ప్రభాకర్(42) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. టీడీపీ మండల నాయకులు ప్రభాకర్ మృతదేహానికి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, చినగాని నరసింహయాదవ్, తుమ్మల సూరి, సిరిగారిపల్లి రవి, గంగాధర్, సోమశేఖర్, గణేనాయక్, చంద్రశేఖర్, శివరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన మురళి అనే యువకుడు మున్సిపల్ కార్యాలయ సమీపంలో విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మురళి లారీ మెకానిక్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం విషద్రావకం తాగి అపరస్మారక స్థితిలో పడి ఉన్న అతనిని స్నేహితులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. యువకుడు ఆత్మహత్య యత్నించిన కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌లో ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీ చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. రాంనగర్‌కు చెందిన సింగేటి భరత్ శుక్రవారం రాత్రి ఇంటిముందు ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశాడు. శనివారం ఉదయం లేచి చూసే సరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. చోరీకి గురైనట్టు గుర్తించి టూటౌన్ పోలీసులకు భరత్ ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు టూటౌన్ పోలీసులుతెలిపారు.

సంత వేలం వాయిదా

ఓబుళదేవరచెరువు, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల గ్రామ సచివాలయంలో శనివారం వారపు సంత వేలం వాయిదాపడింది. ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, కార్యదర్శి మద్దిలేటిరెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. నిర్ణయించిన ధరకంటే తక్కువగా వేలం పాట పాడడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఓటీపీల కోసం అంగన్‌వాడీల పాట్లు

నంబులపూలకుంట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతినెల అందిస్తున్న పింఛన్ల పంపిణీలో భాగంగా 8 మంది అంగన్‌వాడీకార్యకర్తలకు కూడా అప్పగించారు. లబ్ధిదారుల వేలిముద్రల సేకరణ సమయంలో ఓటీపీలు సచివాలయ సిబ్బందికి వస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. ఓటీపీలు వచ్చినప్పుడు సచివాలయ సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు పడుతున్నారు. మీరు తప్పకుండా పింఛన్ పంపిణీ చేయాలని చెప్పినట్లు ఆవేదన చెందుతున్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దీనిపై ఎంపీడీఓ అంజనప్ప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ముక్కుపిండి పన్ను వసూళ్లు

● చెల్లించని వారి ఇళ్ల కొళాయి కనెక్షన్ కట్
● ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సచివాలయ సిబ్బంది

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో సచివాలయ సిబ్బంది ముక్కుపిండి పన్నులను వసూళ్లు చేస్తోంది. ప్రియాంకనగర్, హమాలీ కాలనీలలో పన్ను కట్టని వారి ఇళ్లకు కొళాయి కనెక్షన్‌లు కట్ చేస్తున్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో అధికారులు కూలిపనులకు వెళ్లి కుటుంబాలను నెట్టుకొచ్చే వారిపై ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. ఇది ఇలా ఉండగా 25వ వార్డు సచివాలయంలో సిబ్బంది ఒకరు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్టు స్థానికులు రవి, అంకన్న, చీమలరామాంజి, గడ్డంసూరి పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధుల ఇళ్లకే రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు పన్నులు బకాయిలు ఉన్న వారిని వదిలేసి చిన్నచిన్న మొత్తాలున్న పేదలపై ఒత్తిడి తెస్తూ పన్నుచెల్లించాలని లేకపోతేకొళాయి కనెక్షన్ కట్ చేస్తామని దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.


సచివాలయ సిబ్బందితో వాగ్వావాదం చేస్తున్న ప్రజలు

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టండి

● కౌన్సిలర్ల డిమాండ్

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ సమావేశపు భవనంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. పలువురుకౌన్సిలర్లు ఆయావార్డుల సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ..మున్సిపాలిటీలో ఎన్ని ట్రాక్టర్లు ఉన్నాయి, అందులో ఎన్ని రిపేరిలో ఉన్నాయి, ఎన్ని పనిచేస్తున్నాయని కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను ప్రశ్నించారు. స్పందించిన కమిషనర్ తాను బాధ్యతలు చేపట్టినప్పుడు 8 ఉండగా అందులో 5 రిపేరిలో ఉన్నాయన్నారు. పట్టణంలో వాటర్ ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయా, ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా, ఫిల్టర్లు మార్చుతున్నారా అని 9వ వార్డుకౌన్సిలర్ సాయికుమార్ అధికారులను ప్రశ్నించారు. కచ్చితంగా పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్లను నిర్వహిస్తుంటే చర్యలు తీసుకుంటామన్నారు. లక్ష్మీచెన్నకేశవపురంలో హైమాక్స్ లైట్లు వేయాలని ప్రతి కౌన్సిల్ సమావేశంలో అడుగుతున్నా పట్టించుకోలేదని కౌన్సిలర్‌లు పురుషోత్తంరెడ్డి,మేడాపురం వెంకటేశ్ అధికారులను ప్రశ్నించగా పండుగ తరువాత అమర్చుతామన్నారు. వైస్‌చైర్మన్లు షేక్ షంషాద్‌బేగం, జయరామిరెడ్డి, కౌన్సిలర్‌లు, టీపీఓ విజయభాస్కర్, ఆర్ఐ శివ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు శ్యామ్సన్, కేశవ, ఏఈ కళావతి పాల్గొన్నారు.


సమస్యలను విన్నవిస్తున్న కౌన్సిలర్ నారాయణరెడ్డి

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

కదిరి, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాలు వేసి, నివాళి అర్పించారు. ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. పవన్ కుమార్‌రెడ్డి, పర్వీనాభాను, డైమండ్ ఇర్ఫాన్, అల్ఫాముస్తఫా, మోపూరి శెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొత్తచెరువు/పుట్టపర్తి రూరల్: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాల కోసం స్థాపించిన టీడీపీ కార్యకర్తలకు జెండానే ధైర్యాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి అన్నారు. 43వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తచెరువులో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు.


కదిరిలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కందికుంట


కొత్తచెరువులో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


ధర్మవరంలో టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


నంబులపూలకుంటలో...


ముదిగుబ్బలో...


తనకల్లులో...


నల్లమాడలో...


గాండ్లపెంటలో...


బుక్కపట్నంలో...


ఓబుళదేవరచెరువులో...


తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో..


ధర్మవరం రూరల్ పోతుకుంటలో...

వాడవాడలా పుసుపు జెండా

రెపరెపలు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన తొలి వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



కొల్లకుంటలో జరిగిన వేడుకలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, మున్సిపల్ చైర్మన్ రమేష్

తెలుగోడి ఆత్మగౌరవం టీడీపీ

హిందూపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగువాడి ఆత్మగౌరవం కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశంపార్టీ అని నాయకులు పేర్కొన్నారు. శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లుకుంట గ్రామంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం తరువాతే బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం వచ్చిందన్నారు. పట్టణంలోని పలుచోట్ల జెండా ఆవిష్కరించిన మునిసిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు పయనిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించారన్నారు. పూలకుంటలో సర్పంచ్ మంజునాథ్, రామక్రిష్ణారెడ్డి, మణేసముద్రంలో కన్వీనర్ అశ్వర్థనారాయణరెడ్డి, తూముంకుంటలో చిక్కీరప్ప, కొటిపిలో వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణాచలరెడ్డి, ఉమాశంకరరెడ్డి, బేవనహళ్లిలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, ఎన్టీఆర్ సర్కిల్‌లో పట్టణ, రూరల్ మండలనాయకులు జెండా ఆవిష్కరించి పూలమాలలువేశారు.



హిందూపురంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



గోరంట్లలో పాల్గొన్న టీడీపీ నాయకులు



పరిగిలో...



పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లిలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న సర్పంచ్ నాగమూర్తి తదితరులు



చిలమత్తూరు మండలం పెద్దన్నపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి తదితరులు



సోమందేపల్లి మండలం మాగేచెరువులో జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు, మాజీజడ్పీటీసీ వెంకటరమణ



లేపాక్షిలో కేక్‌కట్‌చేస్తున్న మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ తదితరులు

పండుగ సందడి

కిటకిటలాడిన మార్కెట్... భారీగా పెరిగిన పూల ధరలు





పూలు, మామిడాకులు, టెంకాయలను విక్రయిస్తున్న వ్యాపారులు

హిందూపురం అర్బన్ మార్చి 29,(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది. దీంతో ప్రధాన రహదారులన్నీ కిటకిటలాడాయి. ఎటుచూసినీ రద్దీ కనిపించింది. ఎండను సైతం లెక్క చేయకుండా బజారు సందడిగా మారింది. పూలు, పండ్లు, మామాడి ఆకులు కొనేందుకు బారులు తీరారు. దుకాణాలు, వస్త్ర సముదాయాలు కిటకిటలాడాయి. చెండు పూలు కిలో రూ. 50 పలుకగా, చామంతి కిలో రూ. 300, కాగడాలు కిలో రూ. వేయి, కనకాంబరాలు కిలోరూ. వేయి పలికాయి. గులాబీలు కిలో రూ. 300 ధర పలికాయి. పండుగ సందర్భంగా ధరలు ఆకాశాన్నంటాయి.

ఎన్టీఆర్ పథకాలే నేటికీ దేశవ్యాప్తంగా అమలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంఎస్ రాజు, గుండుమల



ఇఫ్తార్ విందు స్వీకరిస్తూ..

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలే నేటికీ దేశవ్యాప్తంగా అమలు అవుతున్నాయని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ జెండా ఆవిష్కరించి కేక్‌కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు కౌన్సిలర్లు, 200 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఎమ్మెల్యే ఎస్.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో 17వవార్డు కౌన్సిలర్ సుభద్ర, 5వవార్డు కౌన్సిలర్ ప్రియాంకలతోపాటు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని, కొత్తవారికి సైతం తగిన ప్రాధాన్యం కల్పిస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిప్పేస్వామి అన్నారు.

మహిళా సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

మహిళలు అన్ని అవకాశాలను అంది పుచ్చుకోవాలని, మహిళల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగమల్లేశ్వరి, కమిషనర్ రంగస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కన్వీనర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

నాయకులకు పరామర్శ

రొళ్ల: తెలుగుయువత అధికార ప్రతినిధి మారుతీప్రసాద్‌ను శనివారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు. వారి వెంట టీడీపీ నాయకులు మండల కన్వీనర్ దాసిరెడ్డి తదితరులు ఉన్నారు.

గుడిబండ: తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్‌ను మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శనివారం పరామర్శించారు. మంజునాథ్‌కు కాలు ఫ్రాక్చర్ కావడంతో విషయాన్ని తెలుసుకొన్న వారు గ్రామానికి వెళ్లి పరామర్శించారు. వారి వెంట మండల కన్వీనర్ మద్దనకుంటప్ప ఉన్నారు.

శాంతి, సహనానికి ప్రతీక రంజాన్

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): శాంతి సహనానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం రాత్రి ఖుబా మసీదులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఉపవాసం ఉంటూ దానధర్మాలు చేస్తూ పండుగను ముస్లింలు జరుపుకుంటారన్నారు.

పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధి: చైర్మన్

హిందూపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని చైర్మన్ డీఈ రమేష్ పేర్కొన్నారు. శనివారం అత్యవసర కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 18 కోట్లు వసూలు పన్నుల రూపంలో వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ కౌన్సెలర్లు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సుంకం వసూళ్లకు వేలం దక్కించుకుని డబ్బు చెల్లించిన వారు ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. కౌన్సెలర్ శివ మాట్లాడుతూ మునిసిపల్‌స్థలాలు కొన్నిచోట్ల కబ్జా అయ్యాయని ముఖ్యంగా కొట్నూరులో కొంతమంది షెడ్లు వేసుకున్నారన్నారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.



మాట్లాడుతున్న రమేష్

కమిషనర్ మాట్లాడుతూ అది గ్రామ కంఠం మీద స్థలం ఉందని సర్వేచేయించి అది మున్సిపాలిటీ స్థలం ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సమస్యపై కౌన్సెలర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ గతం కంటే ఇప్పుడు మెరుగుపడిందన్నారు. దీంతోపాటు గొల్లపల్లి రిజర్వాయర్ నీటి విభాగం బకాయిలు ప్రభుత్వం చెల్లించేవిధంగా ఎమ్మెల్యే ద్వారా సిఫార్సు చేయించామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన 6వ వార్డు మాజీ కౌన్సెలర్ బీఎన్ మూర్తి మృతిపట్ల సభ్యులు 2నిమిషాలపాటు మౌనం పాటించారు.

ప్రతి పౌరుడూ హక్కులు పొందాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

హిందూపురం, మార్చి, 29(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు పొందాలని ఎస్పీ రత్న అన్నారు. శనివారం కొట్నూరు ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరై ఎస్పీ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై చైతన్యవంతులు కావాలన్నారు. సమాజంలో రెండు గ్లాసుల పద్ధతి ఉండరాదన్నారు. ఎక్కడైనా దళిత వాడల్లో ఇతరుల నుంచి ఇబ్బంది ఉంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐ జనార్ధన్, ఎస్ఐ శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

'యువత క్రీడల్లో రాణించాలి'

చిలమత్తూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని దేమకేతేపల్లిలో గ్రామీణ క్రీడాకారుల కోసం క్రికెట్ టోర్నమెంట్‌ని నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్‌ని శనివారం మండల టీడీపీ నాయకులు రంగారెడ్డి, అంజినప్ప, బేకరీ గంగాధర్, కురుబ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో మానసిక ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వం సాధ్యమన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

పెనుకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. 'జగన్ సర్కారుపోయి బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాక్‌లు అనే పుస్తకాన్ని హరి, బాబావలి, తిప్పన్న ఆవిష్కరించారు. విద్యుత్ చార్జీల పెంపు, సర్దుబాటు తదితర అంశాలను ఈ పుస్తకంలో వివరించడం జరిగిందన్నారు.

మురుగు గుంత సమస్య పరిష్కారం

సోమందేపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్‌వద్ద బాలాజీనగర్‌లో సమస్యగా మారిన మురుగు గుంతను శనివారం పంచాయతీ అధికారులు పూడ్చేశారు. కొంతకాలంగా పందులకు ఆవాసంగా, దోమలకు నిలయంగా మారి కాలనీలో సమస్యాత్మకంగా మారిన మురుగు గుంత సమస్యను అధికారులు పరిష్కరించారు. స్థానికులు సమస్యను డీపీఓ సమత దృష్టికి తీసుకెళ్లగా అధికారులు చర్యలు తీసుకుని పూడ్చేశారు. డీఎల్‌పీఓ శివ నారాయణ పర్యవేక్షించారు.

అంబేడ్కర్ విద్యాదివస్‌కు ఆహ్వానం

పెనుకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విద్యాదివాస్ కార్యక్రమానికి రావాలని మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథిలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆహ్వానించారు. శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దన్న రామాంజినేయులు, శంకర్, ఎంఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు, గోవిందు తదితరులు దళిత సంఘం నాయకులు వారికి ఆహ్వానించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా పట్టణానికి చెందిన జయనాబ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నూర్‌మహమ్మద్ భార్య జయనాబ్. కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను గోరంట్ల ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

పౌరహక్కులపై సమావేశం

గోరంట్ల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కులపై తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్ శనివారం సమావేశం నిర్వహించారు. తొలుత వారు మల్లాపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించారు. అనంతరం పాఠశాలలో సమావేశం నిర్వహించి పౌరహక్కులు, వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానటరింగ్‌కమిటీ సభ్యులు దేవరకొండ ఉమాశంకర్, సర్పంచ్ శివానంద్ పాల్గొన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సివిల్‌రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. తహసీల్దార్ మారుతి మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ చారిటుబల్ ట్రస్ట్ తరుపున 200 ముస్లిం కుటుంబాలకు బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత శనివారం రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రంజాన్ ఘనంగా జరుపుకోవాలని తోఫాలు అందజేశారని, వైసీపీ పాలనలో గాలికి వదిలేశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సైతం తన తండ్రి పేరుపై ఏర్పాటుచేసిన ట్రస్ట్ ద్వారా తోఫాలు ఇచ్చామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల ప్రభుత్వమని రూ.5,400కోట్లు మైనార్టీలకు బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో దాదు, షౌకత్, జబీ, బాబుల్‌రెడ్డి, కేశవయ్య, చిన్నవెంకటరాముడు, సూరి పాల్గొన్నారు.

మానవ సంబంధాలు బలపడాలి

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ



మాట్లాడుతున్న న్యాయాధికారి శైలజ

హిందూపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు మెరుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం లేపాక్షి మండలం శిరివరం కుర్లపల్లి గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి మాట్లాడుతూ రోజు రోజుకు మానవ సంబంధాలు దిగజారి పోతున్నాయన్నారు. ఇది భవిష్యత్ తరాలకు ఆందోళన కలిగించే అంశమన్నారు. ఆడపిల్లల భద్రత పట్ల తల్లితండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, రవిచంద్ర, ఈశ్వరప్ప, ఎస్ఐ నరేంద్ర, ఎంపీడీఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి కవచానికి బంగారు వర్ణపూత

హిందూపురం అర్బన్, మార్చి, 29(ఆంధ్రజ్యోతి): పేట వెంకటేశ్వర ఆలయంలో గర్భగుడి ముందు ఉన్న వెండి కవచం స్థానం లో బంగారు వర్ణపూత కవచాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాదిని పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో వెంకటరమణస్వామి

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

డాక్టర్ ప్రభావతి



ఆరోగ్య సూచనలు ఇస్తున్న వైద్యులు

హిందూపురం అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బెంగళూరు రైల్వే వైద్యులు సీఎంఎస్ డాక్టర్ ప్రభావతి సూచించారు. శనివారం స్థానిక రైల్వే ఆసుపత్రిలో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, వారి కుటుంబాలకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి నిత్యం ఉద్యోగ ఒత్తిడితో పని చేస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తుంటారని, ఆరోగ్యంపై అశ్రద్ధవహించరాదన్నారు. అనంతరం డెంటల్, ఆర్థో, కంటి తదితర పరీక్షలకు వైద్యులు నిర్వహించారు. కార్యక్రమంలో బెంగళూరు వైద్యులు నగేష్, మూర్తి, ప్రియదర్శిని, కృష్ణమూర్తి, మేఘలతోపాటు హిందూపురం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతిమ ఫార్మసిస్టు వెంకటాద్రి, రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల పెన్షనర్స్ అసోసియేషన్ హిందూపురం బ్రాంచ్ అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నరసింహ లక్ష్మణ్ కోశాధికారి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.